క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

సోమందేపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ పర్యటించనున్నారు. బాలాజీ నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం, ద్వారకా మాయినగర్‌లో నిర్వహించే మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం తెలిపారు. అనంతరం వైఎస్సార్ ఆసరా సంబరాలకు హాజరవుతారన్నారు.

పర్యావరణాన్ని కాపాడితేనే మనుగడ



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

పెనుకొండ: పర్యావరణాన్ని కాపాడితేనే మానవ మనుగడ సాధ్యమని ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్ నాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోని పక్షంలో భావితరాలు అనేక ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుదని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా దీపోత్సవం



దీపాన్ని వెలిగిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లిలో సజ్జ గంట రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆది ఆంధ్ర భక్తుని దీపోత్సవం కనుల పండువగా జరిగింది. వేలాది మంది భక్తుల నడుమ భక్తిశ్రద్ధలతో ఆలయం వద్ద దీపాన్ని వెలిగించారు. అనంతరం మోహినీ అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త రమాకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

సరైన వైద్యంతో ‘ఆటిజం’ దూరం

హిందూపురం టౌన్: బుద్ధిమాంద్యం, ఎదుగుదల లేని పిల్లలకు సరైన వైద్యం అందిస్తే ‘ఆటిజం’ నుంచి దూరం చేయగలమని మెడికల్ సూపరిటెండెంట్ డాక్టర్ రోహిల్‌కుమార్, మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ సురేష్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆటిజం అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. చిన్నారుల్లో మానసిక ఎదుగుదల లోపం ఉన్నట్లు తల్లిదండ్రులు గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. పిల్లల్లో ఉన్న లక్షణాలను బట్టి ఆక్యూపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ, ఒకేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీ, ఫిజియోథెరపీ లాంటివి అందించడం ద్వారా ఆటిజం లక్షణాలను కొద్ది మేర మెరుగుపరచడానికి అవకాశం ఉంటుందన్నారు. చిన్నపిల్లల వైద్యుడు ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడిగా చిత్తయ్య పూజార్



పావగడ: తాలూకాలోని దవడ బెట్ట గ్రామానికి చెందిన డీకే చిత్తయ్య పూజార్ కేంద్ర సాహిత్య అకాడమీ కన్నడ విభాగం సలహా సమితి సభ్యుడిగా గురువారం ఎంపికయ్యారు. ప్రస్తుతం ఈయన బెంగళూరు విశ్వ విద్యాలయంలో కన్నడ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. కన్నడ సాహిత్యం, జానపద, శాసన, సంస్కృతి అంశాలపై సుమారు 60కి పైగా గ్రంథాలు రచించారు.

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని రాస్తారోకో

లేపాక్షి: గలిబిపల్లి క్రాస్ వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం మధ్యాహ్నం స్థానికులు రాస్తారోకో నిర్వహించారు. కొడికొండ చెక్ పోస్టు నుంచి శిర వరకూ వెళ్లే రహదారి పక్కన వున్న బస్ షెల్టర్‌ను రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా తొలగించారు. వెంటనే బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ ఆదినారాయణతో కలిసి గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో ఎస్ఐ మునీర్ అహమ్మద్, తహసీల్దార్ బాబు ఘటనా స్థలానికి చేరుకున్నారు. జాతీయ రహదారి అధికారులను ఫోన్‌లో సంప్రదించగా బస్ షెల్టర్ పనులు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

లేపాక్షి: ఇప్పటి వరకూ ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ కాని వారు, కొత్తగా పొలం పాసుపుస్తకం తెచ్చుకున్న రైతులు వెంటనే వైఎస్సార్ రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ శ్రీలత గురువారం తెలిపారు.

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం



అమరాపురం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి.



పెనుకొండ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



పెనుకొండ: ఆసరా సంబరాల్లో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

- ఎమ్మెల్యేలు తిప్పేస్వామి, శంకరనారాయణ

అమరాపురం: దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక పథకాలను మహిళలకు అందించి, వారి సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయ ఆవరణలో మూడో విడత వైఎస్సార్ సంబరాలను ఏపీఎం తిప్పన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే తిప్పేస్వామికి మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన తనయుడు ప్రస్తుత సీఎం జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీతోనే మహిళలకు రక్షణ, సంక్షేమం, ఆర్థికాభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామాల్లో ఉన్న అక్కచెల్లెమ్మల ముఖాల్లో ఆనందాన్ని చూడటమే జగనన్న ధ్యేయమన్నారు. జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అక్కచెల్లెమ్మల డ్వాక్రా రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం మూడో విడత ఆసరా పథకం కింద రుణాలు మాఫీ చేస్తున్నామన్నారు. మహిళలు సంతోషంగా ఉంటే ఆ కుటుంబం, రాష్ట్రం బాగుంటుందని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా మహిళలకు 50 శాతం పదవులను కట్టబెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని తెలిపారు. మహిళలందరూ జగనన్నకు అండగా ఉండాలని కోరారు. మహిళల భద్రతకు దిశా చట్టాన్ని అమలు చేసి వారికి రక్షణగా నిలుస్తున్నరన్నారు. కృష్ణా జలాలను హంద్రీనీవా కాలువ ద్వారా అమరాపురం చెరువును త్వరలోనే నింపుతామన్నారు. ఈ ప్రాంత రైతులు నీటి కోసం పడుతున్న కష్టాలను సీఎం జగనన్నకు పలు మార్లు తెలుపడంతో గొల్లపల్లి నుంచి మడకశిరకు సబ్ బ్రాంచ్ కెనాల్ మంజూరు చేశారని గుర్తు చేశారు. మండలాల్లోని చెరువులను నీటితో నింపి, సశ్యశ్యామలం చేస్తామన్నారు. సీఎం సహకారంతో మడకశిర నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మహిళలందరూ సీఎం జగనన్నకు అండగా నిలిచి, 2024 ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. అనంతరం 895 మహిళా సంఘాలకు రూ.7,43,77,889 మెగా చెక్కును అందజేశారు.

బాబును నమ్మి మోసపోవద్దు

చంద్రబాబు, నారా లోకేష్ చెప్పే మాయ మాటలను నమ్మి, మోసపోవద్దని తెలిపారు. గత ఎన్నికల్లో మహిళా సంఘాల రుణాలు మాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిన విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్ ఎంపీపీలు కృష్ణమూర్తి, లలితమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు చిక్కన్న, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు గగన, వీరక్యాతరాయ, మహాలక్ష్మి, సుందర్‌రాజు, ఎంపీటీసీలు, సర్పంచులు, జేసీఎస్ సచివాలయాల మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, హేమ మండల సమాఖ్య అధ్యక్షురాలు లలితమ్మ, ఏసీ ప్రసాద్, ఏపీఎం తిప్పన్న, సీసీలు, ఎంపీడీఓ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

రూ.6.28 కోట్ల మెగా చెక్కు అందజేత..

పెనుకొండ: మహిళా సాధికారతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో గురువారం వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. 615 మంది మహిళా సంఘాల సభ్యులకు 3వ విడతగా మంజూరైన రూ.6.28 కోట్ల మెగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత మూడేళ్లలో ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలని ముఖ్యమంత్రి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు అన్నింటినీ అమలు చేసినట్లు తెలిపారు. వైఎస్సార్ చేయూత, వైఎసార్ ఆసరా, అమ్మ ఒడి, నేతన్న నేస్తం, విద్యాదీవెన, వసతి దీవెన, ఈబీసీ నేస్తం ఇలా ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి, మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్నను కించపరిచేలా మాట్లాడుతున్న నారా లోకేష్‌కు ప్రజలే బుద్ధి చెబుతారాన్నరు. చంద్రబాబు మాటలకు ప్రజలు మోసపోరాదని, ఆయనకు అధికారం ఇస్తే అన్ని పథకాలు రద్దు చేసి, ప్రజలను కష్టాల్లోకి లాగేస్తారన్నారు. జగనన్నకు, రాష్ట్ర ప్రభుత్వానికి మహిళ అండగా నిలవాలన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ.. చంద్రబాబు కపట మాటలు నమ్మితే మహిళలకు ఇబ్బందులు తప్పవని గుర్తు చేశారు. అక్కచెల్లెమ్మలను ఆదరిస్తున్న జగనన్నకు అండగా నిలుద్దామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శివశంకరప్ప, ఐకేపి సిబ్బంది రవీంద్రారెడ్డి, నరసయ్య, ఎంపీపీ గీత, మాజీ ఎంపీటీసీ రామ్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్యాంనాయక్, జయశంకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, శ్రీనివాసులు, మహిధర్, ముఖ్య నాయకులు రామాంజినేయులు, శ్రీనివాసులు, నిర్మల, నారాయణ స్వామి. కొండల రాయుడు, నటేష్, నరసింహప్ప, ఆదినారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.



అమరాపురం: సమావేశానికి హాజరైన మహిళలు

ఉష్ణోగ్రత సమాచారం

(గరిష్ఠం)

హిందూపురం: 36.0
పెనుకొండ: 38.0
మడకశిర: 36.0

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

రొద్దం: మండల పరిధిలోని లక్కానిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గోపాల్‌రెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచ్ సుభాషిణి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

శిరివరంలో ఇఫ్తార్ విందు



ప్రత్యేక పార్థనల్లో పాల్గొన్న నవీన్‌నిశ్చల్

లేపాక్షి: మండలంలోని శిరివరంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని గురువారం రాత్రి ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ పాల్గొన్నారు. ప్రత్యేక పార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన్య కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, బిసలమానేపల్లి సర్పంచ్ నాగేంద్రబాబు, మాజీ సర్పంచ్ గంగప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

లేపాక్షి: చోళసముద్రం, నాయనిపల్లి గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ ఉద్యోగాలకు ఈనెల 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ తెలిపారు.

పెనుకొండ: కొత్తపేట, శ్రీరాములయ్య కాలనీ, బీటీ ఆర్ కాలనీ, దుద్దేబండ, రొద్దం–2, తురకలాపట్నం ,ఎర్రమంచి–1, శేషాపురం–2, వజ్రాలపేట, జానకి రామయ్య కాలనీలో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సీడీపీఓ శాంతలక్ష్మి తెలిపారు.

సమష్టిగా కృషి చేస్తే విజయం మనదే



అగళిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర(అగళి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. గురువారం అగళిలోని ఆర్కే కల్యాణ మండపంలో సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేస్తే వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రప్ప, జేసీఎస్ కన్వీనర్ శివన్న,వైస్ ఎంపీపీ హేమంతరాజు సర్పంచులు శివకుమార్,నటరాజు, రామకృష్ణప్ప, రంగప్ప, వెంకటస్వామి, ఎంపీటీసీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులంతా సమిష్టిగా పని చేసి వచ్చే 2024 ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని ఎంపీపీ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై ఆయా గ్రామాల సచివాలయాల పరిధిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. తురకలాపట్నం, కోగిర, కంబాలపల్లి, బూచెర్ల, నారనాగేపల్లి, ఎం కొత్తపల్లి, రొద్దం గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈనెల 7 నుంచి 14 వరకూ నిర్వహించే మా నమ్మకం నువ్వే జగనన్న..మా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, వైస్ ఎంపీపీ రామాంజినమ్మ, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతి రెడ్డి పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని హొన్నంపల్లి, పీ నరసాపురం, శిరేకోళం, పైడేటి, యర్రగుంట, శీగిపల్లి, శాసనకోట, శ్రీరంగరాజుపల్లి, మోద, కొడిగెనహళ్లి, పరిగి, ఊటుకూరు సచివాలయ కన్వీనర్ల, గృహసారథులు, వలంటీర్లతో వైఎస్సార్‌సీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. సచివాలయ పరిధిలోని ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీపీ సవిత ప్రభాకర్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, సచివాలయ మండల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, కాణిపాకం ఆలయ ట్రస్టు డైరెక్టర్ మారుతీస్వామి, జెడ్పీటీసీ శ్రీరామప్ప, కో–ఆప్షన్ మెంబర్ సలీం పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం నుంచి నిర్వహించే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్ కోరారు. గురువారం హరేసముద్రం, వైబీహళ్ళి, కదిరేపల్లి పంచాయితీల్లోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులతో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. గృహసారథులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, సర్పంచులు కరియన్న, నర్సేగౌడు, మండల నాయకులు సత్యనారాయణ, జమ్మానిపల్లి మూర్తి, మంజునాథ్, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్ వైద్య అందించడమే లక్ష్యం

గుడిబండ: రాష్ట్రంలోని పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కే.ఎన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, డాక్టర్ సౌందర్య వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే సీఎంగా ఉండాలి



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పించిన మధుమతిరెడ్డి

హిందూపురం: జగనన్న ముఖ్యమంత్రిగా కొనసాగుతూ ఉంటేనే వివక్ష లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతాయని వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని మిట్టమీదపల్లిలో మమేకం కార్యక్రమం కొనసాగించారు. తొలుత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని ప్రజలను కలిసి, పథకాలను వివరించారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు, పార్టీ నాయకులు ప్రజలను దోచుకున్నారన్నారు. ప్రస్తుతం ఎవరి చుట్టూ తిరగాల్సిన పని లేకుండా లంచాలు, సిఫార్సులు లేకుండా పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ రామాంజి, సింగిల్ విండో డైరెక్టర్ రంగనాథ్, ఎంపీటీసీ కృష్ణవేణి, తిమ్మారెడ్డి, రామిరెడ్డి, నారాయణ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మధుసూదన్, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్



పరిగిలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను ప్రారంభిస్తున్న వైద్యులు

అమరాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామీణ ప్రజలకు ఇంటి వద్దనే వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో అమలు చేసిన వైఎస్సార్ ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రజలకు వరం లాంటివని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్లు సిబ్బంది ఆరోగ్య ఆశా కార్యకర్తలు రోగులకు దగ్గరుండి వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, డైరెక్టర్లు వీరక్యాతరాయ, సుందర్‌రాజు, పీఏసీఎస్.అధ్యక్షుడు చిక్కన్న, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్.ఎంపీపీ కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు త్రిలోక్‌నాథ్, పీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల/లేపాక్షి/గోరంట్ల/పరిగి: రొళ్ల మండలం, గుడ్డగుర్కి గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను ఎంపీటీసీ లింగరాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ చిదానంద్, ఎంపీహెచ్ఈఓ షమివుల్లా, సీహెచ్ఓ ఈశ్వరమ్మ, సూపవర్ వైజర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. లేపాక్షి మండలంలోని కోడిపల్లి ఆరోగ్య ఉపకేంద్రంలో గురువారం ఉదయం ఫ్యామిలీ డాక్టర్ సేవలను మండల వైద్యాధికారి డాక్టర్ రాజ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ సుబ్రమణ్యం, సుదర్శన్‌బాబు పాల్గొన్నారు. గోరంట్లలోని నాల్గవ వార్డులో ఎంపీపీ ప్రమీల, కొండాపురం ప్రాథమిక ఆరోగ్య కేందం డాక్టర్ సుప్రియతో కలసి ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సరోజబాయి, ఎంపీడీఓ రఘునాథ గుప్తా పాల్గొన్నారు. పరిగి మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్వరూపరెడ్డి ప్రారంభించారు. సీహెచ్ఓ వన్నప్ప, నాయకులు నాగభూషణ, ఇంద్రసేన, నరసింహారెడ్డి, గఫూర్‌ఖాన్, పర్యవేక్షకురాలు వరలక్ష్మీ, ఏఎన్ఎంలు రాజేశ్వరి, కుమారి పాల్గొన్నారు.

మడకశిర ఎస్ఐగా సురేష్‌బాబు

మడకశిర: మడకశిర ఎస్ఐగా సురేష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకుముందు ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న నాగేంద్రను వీఆర్‌కు పంపారు. త్వరలోనే నూతన ఎస్ఐ సురేష్‌బాబు బాధ్యతలు స్వీకరిస్తారని పోలీస్ వర్గాలు తెలిపాయి. సురేష్‌బాబు వీఆర్ నుంచి మడకశిర ఎస్ఐగా నియమితులైనట్లు సమాచారం.

మట్కా బీటర్ల అరెస్టు

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లిలో ఆన్‌లైన్ మట్కా ఆడుతున్న మంజునాథ్, వినోద్ కుమార్‌ను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.1.80 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్నట్లు నిందితులు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

బీజేపీని ఓడించడమే ధ్యేయం

పావగడ: బీజేపీ పాలిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించడమే సీపీఐ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరీశ్ అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎన్నికల ముందస్తు సభలో ఆయన మాట్లాడారు. బీజేపీ పెట్రోల్ ధరలను అమాంతంగా పెంచి సాధారణ ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేసి కార్మికుల కడుపు కొడుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో రెండు ప్రభుత్వాలను ఓడించడమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో తాలూకా సీపీఐ కార్యదర్శి రామకృష్ణ, అశ్విని, అంజయ్య, కేశవప్ప, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

హిందూపురం టౌన్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం పట్టణంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక సూగూరు సర్కిల్‌లో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని గణేష్ మహల్‌లో శక్తి కేంద్రాల ప్రముఖుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలు, శక్తి కేంద్ర కమిటీలు వంద శాతం పూర్తి చేయాలన్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రపంచంలో భారతదేశాన్ని విశ్వగురువుగా నిలుపుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పార్థసారధి, ఆదర్శ్‌కుమార్, వరప్రసాద్, టీకే బాబు, తిరుమలేష్, నగేష్, దివాకర్ నాయుడు, అమర్‌దేవేందర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జేడీఎస్‌కు అసమ్మతి నాయకుల మద్దతు?

పావగడ: స్థానిక జేడీఎస్ అసమ్మతి నాయకుడు మానం వెంకటస్వామితో పాటు కాంగ్రెస్ అసమ్మతి నాయకులు మాజీ జెడ్పీ సభ్యుడు చన్నమల్లయ్య, మైలారరెడ్డి, సొగడు వెంకటేశ్, లాయర్ నాగేంద్రప్ప తదితరులు జేడీఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తిమ్మరాయప్పకు మద్దతు పలికే అవకాశాలు కనిపిస్తున్నాయి. గురువారం మానం వెంకటస్వామి ఇంట్లో ఇటీవల నూతనంగా నియమితులైన వాల్మీకి మహాసభ జిల్లా అధ్యక్షుడు పాళేగార్ లోకేశ్ సన్మానించారు. ఈ సందర్భంగా వారు భవిష్యత్ కార్యాచరణపై మంతనాలు జరిపారు. కాంగ్రెస్ అభ్యర్థి వెంకటేశ్‌ను ఓడించడమే ధ్యేయంగా వారు జేడీఎస్‌కే మద్దతు పలకాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.